RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక






హైదరాబాద్ | గురువారం 3 -9-2026 | సంచిక: 13 | సంఖ్య: 337 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి



## కాంగ్రెస్‌ది 420 ప్రభుత్వం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## అయోధ్య రామ మందిరానికి కొత్త సీఈఓ..



5 వేల మందిలో మాజీ ఎయిర్ మార్షల్ ఎంపిక!

రామ మందిరానికి తొలి సీఈఓగా జీతేంద్ర మిశ్రా ఎంపిక

గతంలో ఎయిర్‌ఫోర్స్ వెస్టర్న్ కమాండ్ చీఫ్‌గా బాధ్యతలు

సీఈఓ అధికారాల కోసం ట్రస్ట్ డీడ్‌లో మార్పులు

2లో

## ఇక ఉత్తరాంధ్రకు సాగునీటి కష్టాలు దూరం

రైతుల కలను నిజం చేస్తున్నాం: మంత్రి లోకేశ్

కాలువ ద్వారా 2.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు లబ్ధి

ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో ఎడమ కాలువ అనుసంధానం

పరిశ్రమలతో పాటు సాగునీరు అందించి అభివృద్ధి చేస్తామన్న లోకేశ్

2లో

## జీడీపీ వృద్ధి గణాంకాలపై విమర్శలను తిప్పికొట్టిన పీయూష్ గోయల్

విమర్శకులే నిజమైన నిరుద్యోగులంటూ ఘాటు వ్యాఖ్యలు

ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌పై పరోక్ష విమర్శలు

పాత, కొత్త డేటా సిరీస్‌లను పోల్చడం సరికాదన్న కేంద్రమంత్రి

7.8 శాతం వృద్ధి రేటు చారిత్రాత్మకమని, ఇది భారతీయుల ఘనత అని వెల్లడి

2లో

# కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు..



### రాజీనామా ఆదేశాలు రాలేదంటూ క్లారిటీ

ఖర్గేతో భేటీ.. వేణుగోపాల్‌తో ఇంకా సమావేశం కాలేదన్న మంత్రి

అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడి

తనకు ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయమా? అంటూ ప్రశ్నలు

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చే తదుపరి నిర్ణయం కోసం తాను ఎదురుచూస్తున్నానని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తనను రాజీనామా చేయాలని పార్టీ పెద్దలెవరూ అడగలేదని ఆమె తెలిపారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉందన్నారు.

2లో



## తెలంగాణలో ఎయిర్‌పోర్టులపై స్పీడ్ పెంచిన సర్కార్..

మామునూరుకు డిసెంబర్‌లో శంకుస్థాపన

రెండు వారాల్లో మామునూరు విమానాశ్రయ టెండర్లకు శ్రీకారం

డిసెంబర్‌లో పనులకు శంకుస్థాపన చేస్తామన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఆదిలాబాద్‌లో ప్రయాణికులు, కార్గో టెర్మినల్‌తో పాటు ఎంఆర్‌వో కేంద్రం ఏర్పాటుకు సీఎం ప్రతిపాదన

ఢిల్లీ, సెప్టెంబర్: తెలంగాణలో విమానయాన మౌలిక వసతుల విస్తరణకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. వరంగల్‌లోని మామునూరు



# అనకాపల్లి మరో రంగారెడ్డి

పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి చేరిన గోదావరి జలాలు

రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చామని చెప్పిన సీఎం చంద్రబాబు

భవిష్యత్తులో సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తామని ప్రకటన

గత ప్రభుత్వం విధ్వంసం చేస్తే, తాము అభివృద్ధి చేస్తున్నామని విమర్శ

ఉత్తరాంధ్రను ఉన్నతాంధ్రగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి

ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ, పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి గడ్డపై అడుగుపెట్టాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సాధించిన ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా అనకాపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు.

2లో

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"..



కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల

కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ

రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ

రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్

కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

2లో

# వైఎస్సార్‌కు ఘన నివాళి

• ఇడుపులపాయలో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి


• నివాళులర్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

• సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించిన

• వైఎస్ జగన్, తల్లి విజయమ్మ, సతీమణి భారతి రెడ్డి

• వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు

• కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు



సంక్షేమ ప్రదాతగా, అభివృద్ధి విధాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఘనంగా నివాళు లర్పించారు.

తన మాతృమూర్తి, వైఎస్సార్ సతీమణి విజయమ్మ, సతీమణి భారతి రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ ఘాట్‌కు చేరుకున్న వైఎస్ జగన్.. తండ్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛం, పూలమాలలు ఉంచి అంజలి ఘటించారు.



## నేపాల్ వరదల్లో కైలాస యాత్రికులు గల్లంతు..

ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న తెలుగు కుటుంబాలు

నేపాల్ వరదల్లో పలువురు కైలాస యాత్రికులు గల్లంతు

లభ్యం కాని హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై కుటుంబం

మరో యాత్రికుడు ధన్‌పాల్ రెడ్డి కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపు

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"..

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## కాంగ్రెస్‌ది 420 ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రతి విషయంలోనూ మోసం చేసిన '420 ప్రభుత్వం'గా మిగిలిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గొంతు కోసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు.. ఇలా ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తెచ్చారని, ఆరు డీఏలు, పీఆర్సీ, ఈహెచ్ఎస్ చెల్లింపుల్లో కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, రైతులకు ఎకరానికి రూ.15 వేల సాయం, ఏటా 2 లక్షల ఉద్యోగాలు, రూ.4,000 నిరుద్యోగ భృతి హామీలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు ఇస్తామన్న హామీని నీరుగార్చారని, కుల గణన పేరుతో ముస్లింలను బీసీల్లో చేర్చి అసలైన బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు.

## తెలంగాణలో ఎయిర్‌పోర్టులపై స్పీడ్ పెంచిన సర్కార్..

(మొదటి పేజీ తరువాయి)

ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లను మరో రెండు వారాల్లో ఆహ్వానించి, డిసెంబర్ నాటికి ప్రక్రియను పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. అదే నెలలో పనులకు శంకుస్థాపన చేపడతామని తెలిపారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రితో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలోని విమానాశ్రయ ప్రాజెక్టులతో పాటు హెలీ టూరిజం, సీ ప్లేన్ సదుపాయాలపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తిచేసి అందజేసిందని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను కూడా మరింత విస్తృత ప్రయోజనాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్గో, ప్రయాణికుల టెర్మినల్‌తో పాటు ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) సదుపాయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రన్‌వే తుది నిర్ణయానికి రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించాలని కేంద్రాన్ని కోరారు. మామునూరు విమానాశ్రయ అభివృద్ధి, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విస్తరణతో తెలంగాణలో విమాన కనెక్టివిటీ మరింత మెరుగుపడే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రంలో హెలికాప్టర్లను వినియోగించి పర్యాటక ప్రాంతాలను అనుసంధానించేలా హెలీ టూరిజాన్ని ప్రోత్సహించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. దీనివల్ల తెలంగాణ పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని వివరించారు. హుస్సేన్‌సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. దీనికి సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ భేటీలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారు హర్కార వేణుగోపాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి మరో రంగారెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని, దాని ఫలితమే ఈ జలయజ్ఞమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆ దీవెనల ఫలితమే నేడు అనకాపల్లికి గోదావరమ్మను తీసుకురావడం. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మను మార్కాపురానికి తరలించాం. ఈరోజు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరిని అనకాపల్లికి తీసుకొచ్చాం. ఇది ఒక చారిత్రక ఘట్టం" అని ఆయన అన్నారు. హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు తూర్పు కనుమలు, అడవులు, వాగులను దాటుకుని తరలివస్తున్న గోదావరి జలాలను చూసి ఎంతో సంతృప్తి కలిగిందని తెలిపారు. "అనకాపల్లి బెల్లం ఎంత తీయగా ఉంటుందో, ఈ రోజు అంతే తీయగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ జల ప్రవాహం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది సింహాద్రి అప్పన్న చెంతకు, ఆ తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాదాల చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లి వంశధార నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "గలగల గోదావరి, బిరబిరా కృష్ణమ్మ అని పాటల్లో విన్నాం. ఇప్పుడు దానిని నిజం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ జల విజయం ప్రజల విజయం," అని ఆయన అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ ప్రాజెక్టును అనుసంధానించి 12 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ. 3,200 కోట్లు ఖర్చు చేస్తామని, 2028 నాటికి వాటిని జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019 నాటికి మేము పోలవరం పనులను 72% పూర్తి చేశాం. కానీ తర్వాత వచ్చిన గడ్డలి పార్టీ నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు గోదావరి పాలయ్యే పరిస్థితికి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఆ నాయకుడు, తన నివాసం కోసం రుషికొండలో ప్యాలెస్‌కు రూ. 500 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బుతో నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయ్యేవి" అని ఆయన ఆరోపించారు. విశాఖకు డేటా సెంటర్ వస్తే నీరు, విద్యుత్ కొరత వస్తుందని ఇప్పుడు పేటీఎం బ్యాచ్‌తో ప్రచారం చేయిస్తున్నారని, కానీ ఐదు డేటా సెంటర్లకు అవసరమైన దానికంటే వందల రెట్లు ఎక్కువ నీటిని ఇచ్చే శక్తి తమకుందని స్పష్టం చేశారు. భోగాపురం, వెలిగొండలాగే ఈ ప్రాజెక్టు క్రెడిట్‌ను కూడా దొంగిలించేందుకు గత పాలకులు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దార్శనికత**

"సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. జలం ఉంటేనే జీవం, జీవితం," అని చంద్రబాబు అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని కేటాయిస్తామని వివరించారు. అదానీ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, ఫార్మా వంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు. "ఒకప్పుడు హైదరాబాద్ పక్కన రంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందిందో, రేపు అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు వస్తారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా, ఉన్నతాంధ్రగా మారుతుంది. ఇది ఖాయం, రాసిపెట్టుకోండి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**ప్రజలకు పిలుపు.. భవిష్యత్తుకు భరోసా**

గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ, పురుషోత్తపట్నం ద్వారా నదుల అనుసంధానం చేశానని, ఇప్పుడు అనకాపల్లికి నీరు తెచ్చానని, రాబోయే మూడేళ్లలో రూ. 35,000 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

## నేపాల్ వరదల్లో కైలాస యాత్రికులు గల్లంతు..

గల్లంతైన వారిలో ఏపీకి చెందిన ఎన్నారై కూడా ఉన్నట్లు సమాచారం సమాచారం అందక ఆందోళనలో పలు తెలుగు కుటుంబాలుకైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన పలువురు తెలుగు యాత్రికులు నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతయ్యారు. వీరిలో ప్రవాస భారతీయులు కూడా ఉండటంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు 26న ఈ విపత్తు సంభవించినప్పటి నుంచి వారి గురించి ఎలాంటి సమాచారం లభించకపోవడంతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, సమాచారం చేరడంలో జాప్యం జరుగుతుండటంతో బాధితుల కుటుంబాలు ఆశతో ఎదురుచూస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై శ్రీధర్ అవ్వారి, ఆయన భార్య దీప్తి, 14 ఏళ్ల కుమారుడు అభినవ్ ఆగస్టు 13న ఈశా ఫౌండేషన్ బృందంతో కలిసి యాత్రకు వెళ్లారు. ఆగస్టు 26 నుంచి వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఈశా ఫౌండేషన్‌ను సంప్రదించారు. యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో, నేపాల్-చైనా సరిహద్దులోని ఇమ్మిగ్రేషన్ కేంద్రం వద్ద వారు వరదల్లో చిక్కుకున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారని దీప్తి సోదరుడి భార్య ప్రియాంక రాపాక వివరించారు. మణికొండకు చెందిన 38 ఏళ్ల ధన్‌పాల్ రెడ్డి ఆచూకీ కూడా ఇంకా లభ్యం కాలేదు. పుణే నుంచి వెళ్లిన 66 మంది యాత్రికుల బృందంలో తెలంగాణకు చెందిన వ్యక్తి ఈయన ఒక్కరే. వరదలు సంభవించిన రోజున నేపాల్ ఇమ్మిగ్రేషన్ సెంటర్ నుంచి ఆయన చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన ఆచూకీ కోసం బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. చేతులు, భుజాలపై ఉన్న శివుడి టాటూల ద్వారా తన భర్తను గుర్తించవచ్చని ఆయన భార్య సుప్రియ పేర్కొన్నారు.

## జీడీపీ వృద్ధి గణాంకాలపై విమర్శలను తిప్పికొట్టిన పీయూష్ గోయల్

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశం సాధించిన 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటుపై వస్తున్న విమర్శలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతలు, మాజీ ఉన్నతాధికారులను లక్ష్యం చేసుకుంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. గణాంకాల వాస్తవికతను ప్రశ్నించేవారికి సరైన ఉపాధి లేదని, అందుకే వారు టీవీ చర్చా వేదికలపై కూర్చుని కల్పిత వాదనలను తెరపైకి తెస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇటీవల 2026 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి సంబంధించి భారత జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అయితే, ఈ గణాంకాలపై ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వంటి ప్రముఖులు అనుమానాలు వ్యక్తం చేశారు. వృద్ధి రేటుకు అనుగుణంగా ఉద్యోగ కల్పన, పెట్టుబడులు ఎందుకు పెరగడం లేదని రాజన్ ప్రశ్నించగా, ప్రభుత్వం పాత జీడీపీ అంచనాలను సవరించి తగ్గించడం వల్లే ప్రస్తుత వృద్ధి రేటు అధికంగా కనిపిస్తోందని గార్గ్ విశ్లేషించారు.ఈ విమర్శలపై ఢిల్లీలో జరిగిన ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ వార్షిక సదస్సులో పీయూష్ గోయల్ స్పందించారు. విమర్శకులు పాత గణాంకాల సిరీస్‌ను ప్రస్తుత డేటాతో పోలుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. "యాపిల్స్‌ను యాపిల్స్‌తోనే పోల్చాలన్న కనీస పరిజ్ఞానం కూడా వారికి లోపించింది" అని ఆయన చురకలంటించారు. తమ పదవీకాలాన్ని పూర్తి చేయలేకపోయిన వారే ఇప్పుడు విమర్శలకు దిగుతున్నారంటూ పరోక్షంగా కొందరు మాజీ అధికారులపై విమర్శలు గుప్పించారు.

## కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు..

పార్టీ అధిష్ఠానం పిలుపుతో ఢిల్లీకి వెళ్లిన సురేఖ.. అక్కడ కాంగ్రెస్ ముఖ్య నేతలను కలుస్తున్నారు. ఇందులో భాగంగా ఖర్గేతో సమావేశమయ్యారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాత్రం ఇంకా భేటీ జరగలేదని చెప్పారు. ఇప్పటివరకు తనకు రాజీనామా చేయాలని ఎలాంటి సూచన అందలేదని స్పష్టం చేశారు. తనపై వ్యవహరిస్తున్న తీరును ప్రస్తావిస్తూ సామాజిక న్యాయం అంశాన్ని సురేఖ లేవనెత్తారు. తాను బీసీ వర్గానికి చెందినందున ఒక విధానం, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నేతల విషయంలో మరో విధానం ఉంటుందా అని ప్రశ్నించారు. మంత్రివర్గంలో ఉన్న మరికొందరు నేతలపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వారిపై వచ్చిన ఆరోపణలకు ఎలాంటి సమాధానం చెబుతారని, చర్యల విషయంలో ఎలాంటి వైఖరి అవలంబిస్తారని ప్రశ్నించారు. తనకు తెలిసిన అంశాలన్నింటినీ ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేతల దృష్టికి తీసుకెళ్లినట్లు సురేఖ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో పాటు పార్టీ అధిష్ఠానంలోని ఇతర పెద్దలకు రాతపూర్వకంగా వివరాలు అందజేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కూడా పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తాను పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని ప్రశ్నించారు. తన విషయంలోనే కాకుండా సంబంధిత అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఖర్గేను కోరినట్లు కొండా సురేఖ వెల్లడించారు.

## అయోధ్య రామ మందిరానికి కొత్త సీఈఓ..

అయోధ్య రామ మందిరం పరిపాలనకు తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జీతేంద్ర మిశ్రాను నియమించే అవకాశం ఉంది. 5 వేల మందికి పైగా దరఖాస్తుదారుల నుంచి ఆయన్ను ఎంపిక చేసినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భారత వైమానిక దళంలో పలు కీలక కమాండ్ బాధ్యతలు నిర్వహించిన జీతేంద్ర మిశ్రా.. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో వెస్ట్రన్ కమాండ్ చీఫ్‌గా పనిచేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ భేటీలో 12 అంశాలపై చర్చించనున్నారు. ఇందులో రామ మందిరానికి తొలి సీఈఓ నియామకం ప్రధాన అంశంగా ఉంది. సీఈఓకు విస్తృత పరిపాలనా అధికారాలు కల్పించేలా ట్రస్ట్ డీడ్‌లో మార్పులు చేయాలని కూడా నిర్ణయించే అవకాశం ఉంది. 2020 ఫిబ్రవరి 5న ట్రస్ట్ ఏర్పాటైన తర్వాత డీడ్‌లో మార్పులు చేయడం ఇదే తొలిసారి కానుంది. మందిరంలో విరాళాల అక్రమాల ఆరోపణలు, సమర్పణల నగదు మాయం వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ట్రస్ట్ నిర్వహిస్తున్న మూడో సమావేశం ఇది. ఈ వ్యవహారం నేపథ్యంలో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. మందిరం పరిపాలనను మరింత ప్రొఫెషనల్‌గా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సీఈఓ అవసరమని రామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా గతంలో పేర్కొన్నారు. సీఈఓ ప్రభుత్వ జోక్యం లేకుండా పనిచేస్తారని, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శికి నివేదిస్తారని సమాచారం. సీఈఓకు చట్టపరమైన, పరిపాలనా, ఆర్థిక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. సంస్థకు అవసరమైన విధానాలు, వ్యవస్థలు, నిర్వహణ పద్ధతులను రూపొందించడం, ట్రస్ట్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, చట్టపరమైన నిబంధనలను పాటించేలా చూడటం వంటి బాధ్యతలు కూడా ఆయన పరిధిలోకి రానున్నాయి. సంస్థ భవిష్యత్ అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణలో సీఈఓ అత్యున్నత కార్యనిర్వాహక అధికారిగా వ్యవహరించనున్నారు.మందిర భద్రత కోసం శాశ్వత స్థానిక భద్రతా సమన్వయ కమిటీ ఏర్పాటు అంశం కూడా సమావేశం అజెండాలో ఉంది. ట్రస్ట్‌కు అధికారిక మీడియా ప్రతినిధిని నియమించే అంశంపైనా చర్చించనున్నారు.విరాళాల అక్రమాల ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పురోగతిని కూడా ట్రస్ట్ సమీక్షించనుంది.

## ఇక ఉత్తరాంధ్రకు సాగునీటి కష్టాలు దూరం

ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తున్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు తమ ప్రభుత్వం రెక్కలు తొడుగుతోందని, ఇందులో భాగంగానే పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఇప్పుడు గోదావరి జలాలను అందిస్తున్నామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరాంధ్ర రైతుల అభివృద్ధికి ఆరంభమని లోకేశ్ అభివర్ణించారు. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాలను మళ్లించి ఈ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు అందిస్తున్నామని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రతో పాటు తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల రైతులకు కూడా ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. మొత్తం 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనుందని పేర్కొన్నారు. పోలవరం కుడి కాలువ ద్వారా ఇప్పటికే రైతులు సుమారు 500 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారని, అదే తరహాలో ఎడమ కాలువ ద్వారా కూడా ఉత్తరాంధ్ర రైతుల సాగునీటి కష్టాలు తీరతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి పోలవరం ఎడమ కాలువను అనుసంధానించే ప్రక్రియకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని లోకేశ్ వెల్లడించారు. ఉత్తరాంధ్రకు పరిశ్రమలు తీసుకురావడంతో పాటు, పాడిపంటలకు అవసరమైన సాగునీటిని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. సమగ్రాభివృద్ధి, సర్వతోముఖాభివృద్ధి అనే లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

# వైఎస్సార్‌కు ఘన నివాళి

కొద్దిసేపు మౌనంగా కూర్చొని తండ్రిని స్మరించుకున్నారు. ఘాట్ ప్రాంగణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలుమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలువైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించిన అనంతరం తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి భారతి రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్ జగన్ చిన్నాన్న వైఎస్ సుధీకర్‌రెడ్డి, సోదరుడు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిన్నమ్మ వైఎస్ ప్రమీలమ్మ, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీఈసీ సభ్యుడు కె.సురేష్‌బాబు, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ రామిగోవిందరెడ్డి, పులివెందుల పరిశీలకులు పూల శ్రీనివాసరెడ్డి, కమలాపురం, కదిరి ఇన్‌ఛార్జిలు నరేన్ రామాంజులరెడ్డి, మగ్బూల్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేతలు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రాజోలి వీరారెడ్డి, నిత్యానందరెడ్డి, సొహైల్ అహ్మద్, గోసుల శివభరత్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ డి.థామస్ బెన్‌హర్, పాస్టర్లు మత్యుంజయ, నరేష్‌బాబు తదితరుల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేదలకు విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు.



# నల్లవల్లి స్కూల్‌లో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ..

విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఏం తెలుసుకున్నారంటే?

నల్లవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లపై అధికారిణి ఆరా

పిల్లలతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించిన ఉమాదేవి

విద్యార్థుల నుంచి పాఠశాల సౌకర్యాలు, సమస్యలపై వివరాల సేకరణ



**గుమ్మడిదల, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టేందుకు గుమ్మడిదల మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి నల్లవల్లి గ్రామానికి వెళ్లారు. అక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని ఆమె స్వయంగా రుచి చూసి, భోజన నాణ్యతను అంచనా వేశారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి భోజనం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. గ్రామ సర్పంచ్ కోర్వి రాణి సురేష్‌తో కలిసి పాఠశాలకు వెళ్లిన ఎంపీడీవో.. విద్యార్థులకు భోజనం అందించే విధానం, వంటకాల నాణ్యత, రుచిపై ఆరా తీశారు. భోజన నిర్వహణలో తీసుకుంటున్న జాగ్రత్తలను కూడా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఉమాదేవి.. పాఠశాలలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, అందుబాటులో ఉన్న వసతుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ పాఠశాల పరిస్థితిపై వివరాలు సేకరించారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల పోచయ్య, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సన్నవరి రైతులకు అలర్ట్..

## ఈ తేదీలోగా నమోదు చేసుకోకపోతే బోనస్ మిస్

సన్నరకాల ధాన్యానికి ప్రకటించిన అదనపు ప్రోత్సాహకం పొందేందుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సెప్టెంబర్ 8 తర్వాత నమోదు లేని పంటకు బోనస్ వర్తించదని వ్యవసాయ శాఖ స్పష్టీకరణ

విత్తన డీలర్ లేదా గ్రామ ఏఈఓ ద్వారా పంట వివరాలను నమోదు చేసుకునే అవకాశం





**గుమ్మడిదల, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** సన్నరకాల వరిని పండిస్తున్న రైతులు పంటకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ పొందాలంటే మరో కీలక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. సెప్టెంబర్ 8లోపు పంట వివరాలను అధికారికంగా నమోదు చేయకపోతే ప్రోత్సాహక నగదు ప్రయోజనం దక్కదని గుమ్మడిదల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. దీంతో సన్నవరి సాగుదారులు గడువు ముగిసేలోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బోనస్‌కు అర్హత కలిగిన వరి రకాల్లో బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 5204, కేఎన్ఎం 1638, జైశ్రీరామ్, హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్ 962, డబ్ల్యూజీఎల్ 44, జేజీఎల్ 1798 ఉన్నాయి. ఈ రకాలను సాగు చేస్తున్న రైతులు తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సదుపాయం ద్వారా వివరాలను నమోదు చేయవచ్చు. అలాగే గ్రామానికి చెందిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ను సంప్రదించి పంట రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇందుకోసం విత్తన విక్రేతలకు ప్రత్యేక ఆన్‌లైన్ లింక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక రైతులు స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకున్న సందర్భంలోనైనా, తోటి రైతుల నుంచి విత్తనాలు తీసుకుని సాగు చేస్తున్నా నమోదు ప్రక్రియ నుంచి మినహాయింపు ఉండదు. అదేవిధంగా విశ్వవిద్యాలయం లేదా టీజీసీడ్స్ నుంచి విత్తనాలను పొందిన రైతులు కూడా సంబంధిత ఆధారాలతో స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఈ వివరాలను తమ గ్రామ ఏఈఓ ద్వారా నమోదు చేయించుకోవాలని శ్రీనివాస్ సూచించారు. నిర్దేశించిన విధానంలో పంట వివరాలు నమోదు చేయని రైతులకు ప్రభుత్వం ప్రకటించిన సన్నరకాల వరి బోనస్ లభించదని వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు. కాబట్టి అర్హత ఉన్న రైతులంతా 2026 సెప్టెంబర్ 8లోపు ప్రక్రియను పూర్తి చేసి బోనస్ ప్రయోజనాన్ని పొందాలని ఆయన కోరారు.







# 420 హామీలు ఏమయ్యాయి?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై గూడెం మహిపాల్‌రెడ్డి ఫైర్
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఏడు రోజుల పోరుబాటకు శ్రీకారం.. భారీ నిరసన ర్యాలీ
- 22ఏ జాబితాలోని భూముల సమస్యను సభలో లేవనెత్తి బాధితులకు అండగా నిలుస్తామని వెల్లడి







**గుమ్మడిదల (పటాన్‌చెరు), సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఆందోళనకు దిగింది. ఎన్నికల ముందు ప్రజలకు ప్రకటించిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత జాబితాలో చేరిన భూముల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, బాధితుల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ చేపట్టిన ఏడు రోజుల 'పోరుబాట'లో భాగంగా పటాన్‌చెరులో తొలి రోజు నిరసన కార్యక్రమం జరిగింది. మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పార్టీ శ్రేణులు ర్యాలీ చేపట్టాయి. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ రూపొందించిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. అనంతరం 'బాకీ హామీల' కార్డులను ప్రజలకు అందజేశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను నిరాశకు గురిచేశారని మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. అధికారాన్ని దక్కించుకునేందుకు అనేక హామీలు ఇచ్చిన నేతలు.. ఇప్పుడు వాటి అమలుపై నిలదీస్తే సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు. తాను రాజకీయ జీవితంలో అనేక ప్రభుత్వాల పనితీరును చూశానని, ప్రస్తుత పాలన ఇంత దారుణంగా ఉండటం చూడలేదని వ్యాఖ్యానించారు.

### 22ఏ భూముల అంశంపై ప్రత్యేక పోరాటం

వివాదం లేని భూములు సైతం 22ఏ నిషేధిత జాబితాలోకి చేరడంతో వాటి యజమానులు లావాదేవీలు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యతో బాధపడుతున్న వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. అసెంబ్లీ వేదికగా అంశాన్ని బలంగా ప్రస్తావించి, పరిష్కారం లభించే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

### సంక్షేమ పథకాలపై విమర్శలు

గత బీఆర్ఎస్ హయాంలో అమలైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం తగ్గించిందని మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలు, సామాన్య వర్గాలకు గతంలో అందిన సంక్షేమ ప్రయోజనాలు ప్రస్తుతం సక్రమంగా అందడం లేదని విమర్శించారు. ఏడు రోజుల కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డులు, డివిజన్లకు విస్తరించాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలుపై అవగాహన కల్పించాలని కోరారు. బాకీ హామీల కార్డులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు బీఆర్ఎస్ ఉద్యమం ఆగదని, రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ ట్రాఫిక్‌కు చెక్ పెట్టే కొత్త కారిడార్..

## 30 నిమిషాల ప్రయాణం ఇక నిమిషాల్లోనే!

రూ.620 కోట్ల వ్యయంతో నల్గొండ ఎక్స్ రోడ్స్--ఓవైసీ జంక్షన్ మార్గంలో కొత్త కారిడార్

3.23 కి.మీ మేర సిగ్నల్ రహిత రాకపోకలకు అవకాశం

చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** నగరంలో తరచూ ఎదురయ్యే ట్రాఫిక్ ఇబ్బందులకు ఉపశమనం కల్పించే దిశగా మరో కీలక మౌలిక వసతి అందుబాటులోకి రానుంది. నల్గొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ జంక్షన్ వరకు నిర్మించిన కొత్త కారిడార్‌ను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రూ.620 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఈ మార్గంలో వాహనదారులకు సిగ్నళ్ల వద్ద ఎదురుచూసే పరిస్థితి గణనీయంగా తగ్గనుంది. కారిడార్ పరిధిలో నల్గొండ ఎక్స్ రోడ్స్, సైదాబాద్, ఐఎస్ సదన్ మీదుగా ఓవైసీ జంక్షన్ వరకు రాకపోకలు సాగనున్నాయి. మొత్తం 3.23 కిలోమీటర్ల మేర ఈ మార్గాన్ని నిర్మించారు. ఇందులో 2.53 కిలోమీటర్ల ప్రధాన వయాడక్ట్‌తో పాటు 200 మీటర్ల అప్ ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఫలితంగా నల్గొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు వాహనాలు నిరంతరాయంగా ప్రయాణించే అవకాశం ఏర్పడనుంది. ఈ మార్గం అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం రద్దీ అధికంగా ఉండే చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ పరిసరాల్లో వాహనాల నిలిచిపోయే సమయం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రయాణికులకు దాదాపు 30 నిమిషాల వరకు సమయం ఆదా కానుంది. వాహనాలు ఎక్కువసేపు ట్రాఫిక్‌లో నిలవాల్సిన అవసరం తగ్గడంతో ఇంధన వినియోగం కూడా తగ్గే అవకాశముంది. అదే సమయంలో వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించడానికీ ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ప్రభుత్వం పలు మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఫ్లైఓవర్లు, వంతెనలు, సిగ్నల్ రహిత మార్గాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపడంతో పాటు ఆధునిక రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నల్గొండ ఎక్స్ రోడ్స్--ఓవైసీ జంక్షన్ కారిడార్ ప్రారంభంతో హైదరాబాద్ రవాణా మౌలిక వసతుల అభివృద్ధిలో మరో ముందడుగు పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# వెదజల్లే పద్ధతిలో వరి సాగుతో ఖర్చు, నీరు, సమయం ఆదా

## ఎంఏఓ ఋష్యేంద్రమణి

**మిర్యాలగూడ సెప్టెంబర్ 2:** మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామంలో ఆత్మ పొలంబడి ఫార్మ్ స్కూల్ ఆధ్వర్యంలో వెదజల్లే పద్ధతిలో వరి సాగు (డైరెక్ట్ సీడెడ్ రైస్ --డిఎస్ఆర్) చేసుకోవాలని మిర్యాలగూడ మండల వ్యవసాయాధికారి మేకల ఋష్ యేంద్ర మణి కోరారు. వెదజల్లే పద్ధతిలో వరి సాగుపై రైతులకు అవగాహన మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామంలో కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారుమడి పెంచి నాట్లు వేసే విధానం లేకుండా, నేరుగా ప్రధాన పొలంలోనే వరి విత్తనాలను వెదజల్లడం లేదా వరుసలలో విత్తడం వెదజల్లే పద్ధతిగా వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ పద్ధతి ద్వారా కూలీల కొరతను అధిగమించడంతో పాటు ఎకరాకు సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని, నీటి వినియోగం ఆదా అవుతుందని, నాట్ల ప్రక్రియలో సమయం ఆదా అవుతుందని వివరించారు. నేరుగా విత్తడం వల్ల మొక్కల వేర్లు నేలలోకి బలంగా చొచ్చుకుపోయి మొక్కలు బలంగా పెరుగుతాయని తెలిపారు. సాగు విధానం పొలాన్ని బాగా దున్ని, సమతలంగా చదును చేసి నీరు సమానంగా ఉండేలా భూమిని సిద్ధం చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలను విత్తన శుద్ధి చేసి, తగిన విధంగా నానబెట్టి మొలకలు వచ్చిన అనంతరం పొలంలో సమానంగా వెదజల్లాలి లేదా డ్రమ్ సీడర్ ద్వారా వరుసలలో విత్తుకోవచ్చున్నారు.

# రేవంత్ సర్కార్‌కు 1,000 రోజులు..

# కాంగ్రెస్ విజయోత్సవాల వేళ బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డ జగ్గారెడ్డి



**కాంగ్రెస్ హయాంలో 70 వేల ఉద్యోగాల భర్తీ జరిగిందన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్**

**తెలంగాణ ఉద్యమ త్యాగాలపై కేసీఆర్ కుటుంబాన్ని ప్రశ్నించిన జగ్గారెడ్డి**

**కేసీఆర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పట్టించుకోవడం లేదంటూ వ్యాఖ్యలు**




**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో గాంధీభవన్ వేదికగా పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛ కొరవడిందని ఆరోపించిన ఆయన.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం స్వేచ్ఛగా తమ విధులు నిర్వహించే వాతావరణం ఏర్పడిందని జగ్గారెడ్డి అన్నారు. పోలీసుల ఆంక్షలు, మీడియాపై నిర్బంధాలు లేకుండా పాలన సాగుతోందని చెప్పారు. సామాన్యులు, ప్రజాప్రతినిధులు సచివాలయానికి వెళ్లి తమ సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించామని తెలిపారు. గతంలో కనిపించిన నియంతృత్వ ధోరణులకు తెరదించి ప్రజలకు స్వేచ్ఛను అందించామని పేర్కొన్నారు.

**ఉద్యోగాలు, సంక్షేమంపై కాంగ్రెస్ ప్రచారం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం చెందారని జగ్గారెడ్డి ఆరోపించారు. తమ ప్రభుత్వం వెయ్యి రోజుల వ్యవధిలో సుమారు 70 వేల పోస్టులను భర్తీ చేసిందని వెల్లడించారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు.

**తెలంగాణ త్యాగాలపై కొత్త రాజకీయ దుమారం**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది విద్యార్థులు ప్రాణాలు అర్పించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఉద్యమంలో జరిగిన త్యాగాల ఘనతను కేసీఆర్ కుటుంబం తమకే ఆపాదించుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం ఆ కుటుంబానికి చెందిన ఒక్కరైనా ఆత్మబలిదానం చేశారా? అని ప్రశ్నించారు.

**'కేసీఆర్ లేకపోయినా ప్రభుత్వానికి నష్టం లేదు'**

అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ గైర్హాజరవుతున్న అంశంపైనా జగ్గారెడ్డి స్పందించారు. కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదని అడిగితే కేటీఆర్ ఇస్తున్న వివరణ సంతృప్తికరంగా లేదని విమర్శించారు. కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు సభకు దూరంగా ఉన్నా ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏమీ లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పెద్దగా పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు.

**రాహుల్‌గాంధీపై విమర్శలు చేయొద్దంటూ హితవు**

రాహుల్‌గాంధీపై విమర్శలు చేసే అర్హత కేసీఆర్‌కు లేదని జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కాంగ్రెస్ పార్టీ చొరవతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు చేసిన త్యాగాలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ చేసిన కృషిని విస్మరించి వారిపై విమర్శలు చేయడం తగదని జగ్గారెడ్డి సూచించారు.

# మహిళల చేతికి ఆర్థిక బలం..

**278 మంది మైనారిటీ వితంతువులకు రూ.50 వేల చొప్పున సాయం**

**278 మంది మహిళలకు మొత్తం రూ.1.39 కోట్ల ఆర్థిక సహాయం**

**13 మందికి రూ.60 వేల విలువైన జనరేటర్లు, టూల్ కిట్ల పంపిణీ**

**యువతకు విద్యతో పాటు ఉపాధి నైపుణ్యాలు అవసరం: మంత్రి అజహరుద్దీన్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** మైనారిటీ మహిళలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా ఆదాయం సమకూర్చుకునే స్థాయికి ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. ఈ దిశగా మైనారిటీ వితంతు మహిళలకు ఆర్థిక చేయూతతో పాటు ఉపాధి సాధనాలను అందజేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన మైనారిటీ సంక్షేమ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు ఈ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో భాగంగా 278 మంది మైనారిటీ వితంతువులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున నగదు సహాయం అందించారు. దీంతో వారికి స్వయం ఉపాధి చేపట్టేందుకు కొంత ఆర్థిక వెసులుబాటు లభించనుంది. అదేవిధంగా తుర్క కాశా ముస్లిం కమ్యూనిటీకి చెందిన 13 మందికి రూ.60 వేల విలువ చేసే జనరేటర్లు, టూల్ కిట్లను అందించారు. ప్రభుత్వం సమకూర్చిన కుట్టు మిషన్లు, జనరేటర్లు, పనిముట్లను కేవలం ఉపయోగించుకోవడానికే పరిమితం కాకుండా వాటి ద్వారా ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. మహిళలు, యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తే కుటుంబ ఆర్థిక పరిస్థితితో పాటు సమాజంలోనూ మార్పు వస్తుందని పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అజహరుద్దీన్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మైనారిటీ మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. ముస్లింల హజ్ యాత్ర ఏర్పాట్ల కోసం సీఎం రూ.7 కోట్ల నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పాతబస్తీ ప్రాంత యువత భవిష్యత్తుపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. విద్యతో పాటు ఉద్యోగ, వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకునేలా వారిని ప్రోత్సహించాలని కమ్యూనిటీ పెద్దలకు సూచించారు. యువతకు చేపలు పట్టడం నేర్పించినట్టుగా ఉపాధి సంపాదించే మార్గాలను నేర్పించాలని, తద్వారా వారు తమ కుటుంబాలకు మాత్రమే కాకుండా అవసరమైన ఇతరులకు కూడా సహాయం చేయగల స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. నిధుల కేటాయింపులపై వచ్చిన అభ్యర్థనల నేపథ్యంలో మంత్రి తన వైఖరిని స్పష్టం చేశారు. తాను టెస్ట్ ప్లేయర్ మాదిరిగా పదవిలో ఉన్నంతకాలం ప్రజా సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 22A భూములపై సభలోనే తేల్చుకుందాం..

**22ఏ భూముల వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమన్న మంత్రి**

**బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులు, బకాయిలను తమ ప్రభుత్వం చెల్లిస్తోందని వెల్లడి**

**మరో 3 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు ఇవ్వనున్నట్లు ప్రకటన**

## బీఆర్ఎస్‌కు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** 22A భూముల అంశాన్ని రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా శాసనసభ వేదికగా చర్చకు తీసుకురావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. ఆ భూముల పేరుతో అక్రమ కార్యకలాపాలు సాగించేందుకు ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో గత ప్రభుత్వంతో తమ పాలనను పోల్చుకోవాలని పొంగులేటి అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. అప్పట్లో మిగిల్చిన బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం ఒక్కొక్కటిగా చెల్లిస్తోందని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల బకాయిలతో పాటు సర్పంచ్‌లకు చెల్లించాల్సిన మొత్తాలను కూడా తమ ప్రభుత్వమే విడుదల చేసిందని తెలిపారు.

**రైతులకు రూ.1.76 లక్షల కోట్ల సాయం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెయ్యి రోజుల్లో రైతులకు రూ.1.76 లక్షల కోట్ల మేర ప్రయోజనం కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. గతంలో వరి సాగుపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. తమ ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించిందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచేందుకు బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఉప ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన పరాజయాల తర్వాత కూడా బీఆర్ఎస్ నేతల వైఖరిలో మార్పు కనిపించడం లేదని పొంగులేటి అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజలు ఆ పార్టీకి తగిన సమాధానం చెప్పారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన తప్పుబట్టారు. హద్దులు దాటి మాట్లాడితే ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.

**పేదలకు ఇళ్లు.. మరో 3 లక్షల పెన్షన్లు**

తమ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాన్ని పొంగులేటి ప్రస్తావించారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలను పెంచామని తెలిపారు. నిరసనలకు అవకాశం లేకుండా గతంలో ధర్నాచౌక్‌ను తొలగించిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్య స్వేచ్ఛ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలోని 3,475 రోజులతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలన మెరుగ్గా ఉందని ప్రజలు భావిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పేదలకు ఇళ్లు, రేషన్ కార్డుల విషయంలో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. త్వరలో మరో 3 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. ఖమ్మంలో పోడు భూముల సమస్య పరిష్కారం చేస్తామని, భద్రాచలం ఆలయానికి రూ.1,000 కోట్లు కేటాయిస్తామని గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను కూడా పొంగులేటి ప్రస్తావించారు. విలువైన ప్రభుత్వ భూములను పేదలకు అందించకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్ని రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా పేదల కోసం ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ధరణి భూములపై విచారణ కొనసాగుతోంది**

ధరణి వ్యవస్థను అడ్డుపెట్టుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ కొనసాగుతోందని పొంగులేటి తెలిపారు. బీఆర్ఎస్ నేతల ఆస్తుల పెరుగుదలపై ప్రశ్నలు సంధించారు. వేల కోట్ల విలువైన ఆస్తులు ఎలా సమకూరాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హామీలన్నీ ఒకేసారి కాకుండా దశలవారీగా అమలు చేస్తామని చెప్పారు. తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ నేతలు గత పాలనలో జరిగిన పరిణామాలకు సమాధానం చెప్పాలని మంత్రి అన్నారు. పార్టీ ఆస్తులు, ఆర్థిక వ్యవహారాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు.

**కేసీఆర్‌పై మరోసారి విమర్శలు**

ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం లేదని పొంగులేటి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేతగా కొనసాగడానికి అర్హతపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య రాజకీయ అవగాహన ఉందన్న ఆరోపణలకు కవిత చేసిన వ్యాఖ్యలు బలం చేకూరుస్తున్నాయని అన్నారు. ముందుగా తమ పార్టీ, కుటుంబ వ్యవహారాలను సరిదిద్దుకోవాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.



# యూసీపీఏ మెదక్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

## ఏకగ్రీవంగా కమిటీ సభ్యుల ఎంపిక

**మెదక్, సెప్టెంబర్:** మెదక్‌లో బుధవారం నిర్వహించిన యూనివర్సల్ చర్చి పాస్టర్స్ అసోసియేషన్ యూసీపీఏ సమావేశంలో మెదక్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూసీపీఏ చైర్మన్ రెవ. సంజీవరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.నూతన కమిటీకి అధ్యక్షుడిగా జోసెఫ్ పాల్ మెదక్, ఉపాధ్యక్షుడిగా రాజ్ కుమార్ తూప్రాన్, ప్రధాన కార్యదర్శిగా థియోడర్ పెద్దశంకరంపేట, సంయుక్త కార్యదర్శిగా సొలొమోను రాజు చిన్నశంకరంపేట,కోశాధికారిగా లక్ష్మన్ పాల్ (నర్సాపూర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే అడ్వైజర్ కమిటీ సభ్యులుగా స్వామిదాస్, పాల్ సుధాకర్, రెవ. సత్యానందం, రెవ. జెకర్య, రెవ. జ్ఞానరాజ్, కరుణాకర్, సుధాకర్, ఫ్రాన్సిస్ జగన్, కాంతారావు తదితరులను ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో మెదక్ నియోజకవర్గ అధ్యక్షుడు డేవిడ్ రాజు, నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుదాస్, వివిధ కమిటీల సభ్యులు, మండల కమిటీల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, సీఎస్ఐ పాస్టర్లు, జిల్లా పరిధిలోని పాస్టర్లు యోహాను, దేవదాస్, ఎలీషా, సామెల్ బెనహర్, జోయేల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# 22A భూముల వివాదంపై బీజేపీ సమరం..

**కాంగ్రెస్ సర్కార్‌పై ఎంపీల మూకుమ్మడి దాడి**

**నర్సాపూర్‌లో బీజేపీ నిర్వహించిన మహా ధర్నాకు ముగ్గురు ఎంపీల హాజరు**

**భూ భారతి విధానంపై రఘునందన్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరాలు**

**పేదల భూముల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఈటల విమర్శలు**







**మెదక్, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** నర్సాపూర్‌లో 22A జాబితా అంశం బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ వేడిని పెంచింది. నిషేధిత భూముల జాబితాలో తమ భూములు చేరడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ చేపట్టిన మహా ధర్నా సందర్భంగా ఆ పార్టీ ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. భూ రికార్డుల నిర్వహణలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై వారు తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబంలోని తండ్రి, కొడుకు, కూతురు, మేనల్లుడు కలిసి రాష్ట్రాన్ని దోచుకున్నారని రఘునందన్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్నదమ్ముల ఆధిపత్యం కొనసాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల సమస్యలపై నిజమైన పోరాటం చేయకుండా పరస్పరం రాజకీయ డ్రామా నడుపుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై వేల కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీకి చెందిన ఎంతమంది నేతలపై చర్యలు తీసుకుందో చెప్పాలని రఘునందన్‌రావు ప్రశ్నించారు. భూ రికార్డుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ధరణి, భూ భారతి వ్యవస్థలు ప్రజలకు ఆశించిన ప్రయోజనం ఇవ్వడం లేదని అన్నారు. వాటి ద్వారా భూముల విషయంలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని ఆరోపించారు.

**పేదల భూములపై ప్రభుత్వం దృష్టి: ఈటల**

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ కుటుంబంలో నలుగురు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించామని, ప్రస్తుత ముఖ్యమంత్రి కుటుంబంలో ఏడుగురు ఉన్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు అధికారం నుంచి తప్పించడానికి ఎంతో కాలం పట్టలేదని గుర్తు చేసిన ఆయన.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి రాకుండా పాలనలో జాగ్రత్త అవసరమని సూచించారు. పేదలకు చెందిన భూముల విషయంలో రేవంత్‌రెడ్డి కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారని ఈటల ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పేర్కొంటూ, పేదల భూములను స్వాధీనం చేసుకునే అంశంలో ముఖ్యమంత్రి 'రీసెర్చ్ స్కాలర్'గా మారారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**22ఏ జాబితాపై మంత్రి, సీఎంపై రాజీనామా డిమాండ్**



నిషేధిత భూముల జాబితాలో తప్పులు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ ఇద్దరూ పదవుల నుంచి తప్పుకోవాలని కోరారు. భూముల రికార్డుల నిర్వహణ కోసం తీసుకొచ్చిన భూ భారతి.. గతంలోని ధరణి కంటే కూడా సమస్యాత్మకంగా మారిందని కొండా విమర్శించారు. ప్రభుత్వ అధికారులతో కాంగ్రెస్ నేతలు కుమ్మక్కై పెద్ద మొత్తంలో భూములను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 22ఏ జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# మేడిగడ్డపై బీఆర్ఎస్‌ను నిలదీసిన కడియం..

- కవిత వ్యాఖ్యలకు జవాబు చెప్పాలని డిమాండ్
- కాళేశ్వరంలో కుట్ర జరిగిందంటే అప్పుడే కేసెందుకు పెట్టలేదు?.. కడియం శ్రీహరి
- మేడిగడ్డ పిల్లర్లు అప్పట్లోనే దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- కవిత ఆరోపణలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్
- కేసీఆర్ హయాంలో ప్రజలకు కాకుండా కుటుంబానికే మేలు జరిగిందని విమర్శ


**జనగామ, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** కాళేశ్వరం ప్రాజెక్టులో కుట్ర జరిగిందని ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రశ్నించారు. ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు నిర్మాణ దశలోనే కుంగిన విషయాన్ని అప్పట్లోనే గుర్తించారని ఆయన పేర్కొన్నారు. కుట్ర అనుమానం నిజంగా ఉంటే అప్పుడే పోలీసు కేసు ఎందుకు నమోదు చేయలేదో బీఆర్ఎస్ నేతలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. లింగాల గణపురంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రానికి భారీ నష్టం జరిగిందని ఆరోపించారు. అధికారాన్ని వినియోగించుకుని ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు.

**కవిత వ్యాఖ్యలకు ముందుగా జవాబు చెప్పాలి**

బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత లేవనెత్తిన అంశాలపై ఆ పార్టీ నేతలు ముందుగా వివరణ ఇవ్వాలని కడియం శ్రీహరి కోరారు. రాష్ట్రంలో భారీగా దోపిడీ జరిగిందంటూ కవిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. వాటిపై బీఆర్ఎస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీపై వచ్చిన ఆరోపణలను పక్కనపెట్టి కాంగ్రెస్‌పై ఆందోళనలు, విమర్శలు చేయడం సరికాదని అన్నారు. కవిత చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదనుకుంటే వాటిని ఖండించి వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అంతర్గత విభేదాల కారణంగానే ఆమె ఈ అంశాలను బయటకు తీసుకొచ్చారని కడియం ఎద్దేవా చేశారు.

**కాళేశ్వరం నీరు లేకుండానే అధిక పంట దిగుబడి**

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని వినియోగించకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో



రాష్ట్రంలో అత్యధిక వ్యవసాయ దిగుబడులు సాధించిందని కడియం శ్రీహరి తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేశారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో సామాన్య తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదని, కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఆర్థికంగా ప్రయోజనం కలిగిందని విమర్శించారు. పదేళ్ల కాలంలో ఆ కుటుంబం మాత్రమే సంపన్నంగా మారిందని ఆరోపించారు.

**బీజేపీ నేతలకు కడియం ప్రశ్న**

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని నిధులు కేటాయించిందో బీజేపీ రాష్ట్ర నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పష్టంగా చెప్పాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. బీజేపీ నాయకులు తమ రాజకీయ విమర్శలకు వాస్తవాలను జోడించాలని సూచించారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు సర్వేలు, ఎన్నికల్లో తమ పరిస్థితి వెనుకబడుతోందన్న అసహనంతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

**కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం**

తెలంగాణలో అన్ని వర్గాలకు న్యాయం చేయగల సామర్థ్యం కాంగ్రెస్ పార్టీకే ఉందని కడియం శ్రీహరి అన్నారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు అహంకారపూరితంగా, ద్వేషంతో మాట్లాడుతున్నారని విమర్శించిన ఆయన.. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అంశాలపై సమాధానాలు ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించడం వల్ల ప్రయోజనం ఉండదని కడియం శ్రీహరి పేర్కొన్నారు.



# పవన్ కల్యాణ్ బర్త్‌డేకు అభిమానుల సేవా బాట....

## ముఖ్య అతిథిలుగా హీరో తనీష్, మాజీ ఎమ్మెల్యేలు

**కాప్రాలో జన్మదిన వేడుకల సందర్భంగా భారీగా సేవా కార్యక్రమాలు**

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, నోట్‌బుక్స్ పంపిణీ**

**3 వేల మందికి అన్నదానం.. వేడుకల్లో పాల్గొన్న హీరో తనీష్, మాజీ ఎమ్మెల్యేలు**



**కాప్రా, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాప్రాలో అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకృష్ణదేవరాయల సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 250 నుంచి 300 మంది అభిమానులు రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటూ దాతలను అభినందించారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, నోట్ పుస్తకాలను అందజేశారు. అనంతరం దాదాపు 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులకు వస్త్రాలను సమర్పించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో తనీష్, నటుడు నాగ మహేష్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యేలు ఎన్.వీ.ఎస్.ఎస్. ప్రభాకర్, భేతి సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తనీష్, నాగ మహేష్, శ్రీకృష్ణదేవరాయల సేవాసమితి అధ్యక్షుడు అమర్‌బాబు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు లభించాలని, భవిష్యత్తులో తెలంగాణ ప్రజలకు కూడా సేవ చేసే భాగ్యం కలగాలని కోరుకున్నారు. జన్మదిన వేడుకలను విజయవంతం చేయడంలో సహకరించిన సేవాసమితి సలహాదారులు, పెద్దలు, మెగా స్టార్, పవర్ స్టార్ అభిమానులు, కార్యక్రమ నిర్వాహకులు, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అమర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

# ఖంస్త్రుః: పవన్ ఆశయాలే అజెండాగా... మేడ్చల్‌లో జనసేన శ్రేణుల కీలక పిలుపు

**జనసేన సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచన**

**సేవా కార్యక్రమాలతో పవన్ కల్యాణ్ 55వ జన్మదిన వేడుకలు**

**నిమ్మకాయల పెద్దిరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న అభిమానులు**

మేడ్చల్, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం): జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని మేడ్చల్‌లో పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి. ఆయన 55వ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిమ్మకాయల



పెద్దిరాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను సందడిగా నిర్వహించారు. పవన్ కల్యాణ్ ఆలోచనా విధానం, జనసేన పార్టీ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని నాయకులు సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజా సమస్యలపై స్పందిస్తూ సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా సేవా కార్యక్రమాలను కూడా చేపట్టడం ప్రత్యేకంగా నిలిచింది. పుట్టినరోజు కార్యక్రమాలను వినోదానికే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా పవన్ కల్యాణ్ పట్ల అభిమానాన్ని సామాజిక బాధ్యతతో ముడిపెట్టారు. మొత్తంగా పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మేడ్చల్‌లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.



## రోడ్డుకు మరమ్మతులు చేయించిన సర్పంచ్ చిర్ర రజిత రమణాకర్

**పెగడపల్లి సెప్టెంబర్ 2 :** పెగడపల్లి మండలం నా మాపూర్ గ్రామంలో కాలేశ్వరం 2 భాగంగా నాలుగు వరుసల తవ్విన పైప్ లైన్ ల కోసం ఆర్ అండ్ బి రోడ్ వర్షాలకు గుంతలుగా మారింది ఈ రహదారి గుండు వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడటం చూసి ట్రాక్టర్ బ్లేడ్ బండి తెప్పించి చదును చేయించారు.

## ప్రగతి నగర్‌లో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

### పార్టీలకు అతీతంగా నేతల నివాళులు



**నిజాంపేట్, సెప్టెంబర్ 2 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు ప్రగతి నగర్‌లో ఘనంగా జరిగాయి. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, పక్కా ఇళ్ల పథకాలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ ఫలాలను ప్రతి పేద కుటుంబానికి చేర్చి ప్రజా నాయకుడిగా ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని ప్రశంసించారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో అందరూ కలసికట్టుగా నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి, స్థానిక నేతలు బోట్ల తిరుపతి, వడ్లకొండ సందీప్, హరీష్, కృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, దివాకర్ రెడ్డి, మహేష్‌లతో పాటు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి



**మాడుగులపల్లి :** మండల పరిధిలోని తోపుచర్ల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని వల్లపు దాస్ యేసు, వల్లపు దాస్ దేవయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తు చేశారు. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లపు నరేష్, నన్నే పోయిన లింగయ్య, మీసాల నాగేందర్, వల్లపు దాస్ జనార్ధన్, వల్లపు కోటి, బొప్పనీ లక్ష్మయ్య, కనకయ్య, రాచూరి యాదయ్య, ఎల్లయ్య, మంగ నాగరాజు, రాచూరి సైదులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహానేతకు ఘన నివాళులు

**మిర్యాలగూడ, సెప్టెంబర్:** మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలోని వైఎస్సార్ విగ్రహం వద్ద దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గ 17వ వర్ధంతి సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా చిలుకూరి బాలకృష్ణ మాట్లాడుతూ, వైఎస్సార్ గారు పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన మహానేత అని అన్నారు.ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.ప్రజల కోసం వైఎస్సార్ చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.





## ఘనంగా పవన్ బర్త్‌డే వేడుకలు..

### సాయి దుర్గా తేజ్ స్పెషల్ అట్రాక్షన్.. అభిమానుల మధ్య సందడి

### కూకట్‌పల్లి గోపాల్‌నగర్‌లో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన సంబరాలు

### చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన సాయి దుర్గా తేజ్

### రక్తదాన శిబిరాన్ని సందర్శించి దాతలను అభినందించిన సినీ నటుడు

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నేటి ప్రస్థానం):** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ కూకట్‌పల్లిలో అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గోపాల్‌నగర్‌లో జరిగిన ఈ వేడుకల్లో పవన్ కళ్యాణ్ మేనల్లుడు, సినీ నటుడు సాయి దుర్గా తేజ్ పాల్గొనడంతో కార్యక్రమానికి మరింత ఉత్సాహం నెలకొంది. అభిమానులు, జనసేన కార్యకర్తల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో సాయి దుర్గా తేజ్ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రాకతో అభిమానులు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. పుట్టినరోజు వేడుకలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కూడా సాయి దుర్గా తేజ్ పరిశీలించారు. శిబిరంలో జరుగుతున్న కార్యక్రమాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారిని అభినందించారు. రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులు, వాలంటీర్ల సేవలను సాయి దుర్గా తేజ్ ప్రశంసించారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని కేవలం అభిమానుల సంబరాలకే పరిమితం చేయకుండా సామాజిక సేవకు ఉపయోగించడం అభినందనీయ మని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్‌పై అభిమానాన్ని చాటడంతో పాటు రక్తదానం ద్వారా సామాజిక బాధ్యతను ప్రదర్శించారు. దీంతో వేడుకలు అభిమానుల సందడితో పాటు సేవా కార్యక్రమాలతోనూ ప్రత్యేకంగా నిలిచాయి.






## నర్సాపూర్ పాఠశాలలో ఘనంగా హౌస్ ఫార్మేషన్

### క్రీడా పోటీలువిద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో క్రీడలు కీలకం..నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**మెదక్ జిల్లా నర్సాపూర్:** మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం హౌస్ ఫార్మేషన్ డే దినోత్సవం, అంతర్గత క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమానికి మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజితా లక్ష్మీ రాజు, మండల విద్యాశాఖ అధికారి తరసింగ్, రెండో వార్డు కౌన్సిలర్ ఎ. సుధీర్ గౌడ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. పాఠశాలలో క్రీడా కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి నాలుగు హౌస్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హౌస్‌ల ఏర్పాటు కార్యక్రమంతో పాటు హౌస్ జెండాల ఆవిష్కరణ, ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు క్రమశిక్షణ, సమన్వయంతో నిర్వహించిన మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రీడా జ్యోతిని వెలిగించి నిర్వహించిన టార్చ్ రిలే ప్రదర్శన అతిథులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో అంతర్గత పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించా రు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సామ్య పర్యవేక్షణలో ఉపాధ్యాయ బృందం, సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజాప్రతి నిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.



## హైదరాబాద్ లో అంకురా--న్యూ హొరైజన్స్ బాలల అభివృద్ధి కేంద్రాలు......

### కేంద్రాలను ప్రారంభించిన ప్రముఖులు అల్లు స్నేహా రెడ్డి.....



**గచ్చిబౌలి:** చిన్నారులకు సమగ్ర అభివృద్ధి సేవలు అందించేందుకు అంకురా హాస్పిటల్స్ ఫర్ ఉమెన్ ఒ చిల్డ్రన్, న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ యూనిట్లలో ఏర్పాటు చేసిన నూతన బాలల అభివృద్ధి కేంద్రాలను ప్రముఖులు అల్లు స్నేహా రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అంకురా హాస్పిటల్స్ ఎండీ డా. కృష్ణ ప్రసాద్ రావు వున్నం, న్యూ హొరైజన్స్ వ్యవస్థాపకులు డా. సమీర్ దల్వాయి పాల్గొన్నారు.2003లో ముంబైలో ప్రారంభమైన న్యూ హొరైజన్స్ సంస్థ ఆటిజం, ఏ డీ ఏచ్ డీ , సెరెబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్ తదితర అభివృద్ధి సంబంధిత సమస్యలు ఉన్న చిన్నారులకు ప్రత్యేక సేవలు అందిస్తోంది. ఈ భాగస్వామ్యంతో డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్లు, స్పీచ్ థెరపిస్టులు, సైకాలజిస్టులు, ఫిజియోథెరపిస్టుల సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రానున్నాయి.చిన్నారుల శారీరక, మానసిక, భావోద్వేగ అభివృద్ధికి అవసరమైన సేవలను ఒకే చోట అందించడమే కేంద్రాల ప్రధాన లక్ష్యమని ఈ కేంద్రాలు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## బహుజన సాహిత్య అకాడమీ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణకు ఘన సన్మానం

### సామాజిక, సాహిత్య రంగాల్లో చేస్తున్న సేవలను అభినందించిన దళ్ నాయకులు




**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** హైదరాబాద్‌లోని నాచారం, ఉప్పల్‌గూడలో ఉన్న బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో సంస్థ జాతీయ చైర్మన్ నల్ల రాధాకృష్ణను బుధవారం ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన చేపడుతున్న సామాజిక, సాహిత్య కార్యక్రమాలను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దళిత రత్న డా. బుర్రి వెంకన్న ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములు, దళ్ సభ్యుడు ముత్యాలు నల్ల రాధాకృష్ణను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బహుజన సమాజంలో సాహిత్య చైతన్యం, సామాజిక అవగాహన పెంపొందించేందుకు బహుజన సాహిత్య అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం, మహనీయుల ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. నల్ల రాధాకృష్ణ నాయకత్వంలో బహుజన సాహిత్య అకాడమీ మరిన్ని సామాజిక, సాహిత్య కార్యక్రమాలను నిర్వహించి బహుజన వర్గాల్లో చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సంకేతాలు కీలకం..

**ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ ప్రసంగంపై ఫోకస్**

**అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు**

**పశ్చిమాసియా ఉద్రిక్తతలు, క్రూడ్ ధరలపై కన్ను**

**స్వల్ప కరెక్షన్ తర్వాత పరిమిత లాభాలకు అవకాశం**

**ఈ వారం ట్రేడింగ్‌పై స్టాక్ నిపుణుల అంచనాలు**



ముంబై: అంతర్జాతీయ పరిణామాలు ఈ వారం భారత స్టాక్ మార్కెట్ దిశను నిర్దేశించే అవకాశం ఉందని స్టాక్ నిపుణులు భావిస్తున్నారు. జాక్సన్ హోల్ సింపోజియంలో ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్‌ఈ?ష ప్రసంగం, ఎన్‌వీడియా త్రైమాసిక ఫలితాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు ట్రేడింగ్‌పై ప్రభావం చూపవచ్చని చెబుతున్నారు. అగ్రరాజ్యం అమెరికా విడుదల చేసే కీలక ఆర్థిక గణాంకాలపై కూడా ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు. దేశీయంగా విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయి కదలికలు, లిక్విడిటీ పరిస్థితులను మార్కెట్ వర్గాలు పరిశీలించే అవకాశం ఉంది. "ఇన్వెస్టర్లు రియల్టీ, మెటల్, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల వైపు మొగ్గు చూపుతుండటం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారత మార్కెట్లలో కొనుగోళ్లు కొనసాగిస్తుండటం ఊరటనిచ్చే అంశం. రాబోయే రోజుల్లో బ్రెంట్ క్రూడ్ ధరలు 90 డాలర్ల కిందకు దిగువ వస్తే, దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో కన్సాలిడేషన్ చోటుచేసుకునే అవకాశం ఉంది" అని రిలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ హెడ్ అజిత్ మిశ్రా తెలిపారు.

**ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్‌పై దృష్టి**

ఈ వారం జాక్సన్ హోల్ సింపోజియం ఇన్వెస్టర్లకు కీలకంగా మారనుంది. ముఖ్యంగా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్‌ఈ?ష ప్రసంగంపై ప్రపంచ మార్కెట్లు దృష్టి సారించనున్నాయి. సెపట?టంబర్‌లో జరగనున్న ఫెడ్ పాలసీ సమావేశానికి ముందు ద్రవ్యోల్బణం, ఉపాధి పరిస్థితులు, వడ్డీ రేట్ల భవిష్యత్ దిశపై ఆయన ఎలాంటి సంకేతాలిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. అమెరికాలో వడ్డీ రేట్లపై అంచనాలు మారితే ప్రపంచ మార్కెట్లతో పాటు భారత ఈక్విటీలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

**భారత మార్కెట్లో విదేశీ పెట్టుబడుల జోరు**

భారత ఈక్విటీ మార్కెట్లపై విదేశీ పెట్టుబడిదారుల ఆసక్తి మళ్లీ పెరుగుతోంది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ఆగస్టు లో ఇప్పటివరకు (21 తేదీ వరకు) భారత ఈక్విటీల్లో రూ.23,544 కోట్ల పెట్టుబడులు పెట్టారు. కార్పొరేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ఆర్థిక త్రైమాసిక ఫలితాలు ప్రకటన, రూపాయి స్థిర త్వం, మార్కెట్‌పై సానుకూల వృద్ధి అంచనాలు ఇందుకు కారణమయ్యాయి.

పశ్చిమాసియా పరిణామాలు, క్రూడ్ ధరలపై కన్ను...

పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఈ వారం కూడా మార్కెట్లకు కీలకంగా మారనున్నాయి. హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు ఏర్పడిన అంతరాయం కారణంగా ముడి చమురు సరఫరాపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల ఎగువన కొనసాగడం భారత మార్కెట్‌కు ప్రధాన ఆందోళనగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ముడి చమురు ధరలు మరింత పెరిగితే దిగుమతి వ్యయం, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగి మార్కెట్‌పై ఒత్తిడి పడే అవకాశం ఉంది.

**గత వారం స్వల్ప నష్టాలు**

గత వారంతో స్టాక్ మార్కెట్ పరిమితి శ్రేణిలో ట్రేడవుతూ, స్వల్ప అమ్మకాల ఒత్తిడికి లోనైంది. వారాంతంలో శుక్రవారం కోలుకున్నప్పటికీ, మొత్తం వారానికి సెన్సెక్స్ 468 పాయింట్లు (0.60%), నిఫ్టీ 114 పాయింట్లు (0.46%) నష్టపోయాయి. పెరుగుతున్న ముడి చమురు ధరలు, ప్రపంచ బాండ్లపై రాబడులు పెరుగుదల గత వారం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి.

**సాంకేతిక అంశాలు...**

నిఫ్టీలో గత రెండు వారాలుగా కరెక్షన్ కొనసాగిన నేపథ్యంలో, స్వల్ప కాంలో మార్కెట్ కొంత స్థిరీకరణతో పాటు స్వల్పంగా కోలుకునే అవకాశం ఉంది. సాంకేతికంగా నిఫ్టీ పరిమిత శ్రేణిలో ట్రేడవ్వొచ్చు.దిగువ స్థాయిలో 24,200 వద్ద తక్షణ మద్దతు ఉండగా, ఈ స్థాయిని కోల్పోతే 24,000 వరకు కరెక్షన్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, 24,350 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే నిఫ్టీ 24,500 దిశగా కదిలే అవకాశం ఉందని సాంకేతిక విశ్లేషకులు భావిస్తున్నారు.

**అమెరికా గణాంకాలూ కీలకమే**

అమెరికా జీడీపీ అంచనాలు, డ్యూరబుల్ గూడ్స్ ఆర్డర్లు, వినియోగదారుల విశ్వాస సూచీతో పాటు పీసీఈ ద్రవ్యోల్బణ గణాంకాలను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించనున్నారు. ఈ గణాంకాలు అమెరికా ఆర్థిక వ్యవ స్థ స్థితిగతులపై స్పష్టత ఇవ్వడంతో పాటు, ఫెడరల్ రిజర్వ్ తదుపరి విధాన నిర్ణయాలపై మార్కెట్ అంచనాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ వారంలో ఎన?వడియా త్రైమాసిక ఫలితాలు కూడా అంతర్జాతీయ టెక్నాలజీ షేర్ల కదలికలకు కీలకంగా మారవచ్చు.

జూలైలో రూ.20,200 కోట్ల పెట్టుబడుల తర్వాత వరుసగా రెండో నెల కూడా విదేశీ నిధుల ప్రవాహం కొనసాగుతుండటం విశేషం. "కార్పొరేట్ లాభాల వృద్ధి పుంజుకోవడం, క్యూ1 ఫలితాల్లో కనిపించిన మెరుగుదల, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల నుంచి విదేశీ నిధుల మళ్లింపు, రూపా యి స్థిరత్వం తదితర అంశాలు ఎఫ్‌పీఐలను మళ్లీ భారత మార్కెట్ వైపు ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఎఫ్‌పీలులు ఆకర్షణీయమైన వ్యాల్యుయేషన్లలో లభిస్తున్న బ్యాంకింగ్, ఐటీ దిగ్గజాల షేర్లను కొనుగోలు చేయడం లేదు. అధిక వ్యాల్యుయేషన్లు ఉన్నప్పటికీ ఎంపిక చేసిన మిడ్‌క్యాప్ స్టాక్స్‌పైనే దృష్టి సారిస్తున్నారు" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీ.కే. విజయకుమార్ తెలిపారు. ఈక్విటీలతో పాటు డెట్ (రుణ) మార్కెట్‌పైనా విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు.

## 'వైజెడ్ఎఫ్--ఆర్2' వచ్చేసింది..
## రూ.10 వేలతో బుకింగ్!

ద్విచక్ర వాహన తయారీ సంస్థ యామహా మోటార్ తన సూపర్‌స్పోర్ట్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ గురువారం నూతన 'వైజెడ్ఎఫ్--ఆర్2' బైక్‌ను విడుదల చేసింది. చెన్నై యూనిట్‌లో ఉత్పత్తి అవుతున్న ఈ లైట్‌వెయిట్ స్పోర్ట్స్‌బైక్ ధరను రూ.2.30 లక్షలుగా (ఎక్స్--షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. పదివేల రూపాయల టోకెన్ అమౌంట్‌తో ఈ బైక్ ముందస్తు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఇందులో కొత్తగా అభివృద్ధి చేసిన 200సీసీ లిక్విడ్--కూల్డ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 26.5 బీహెచ్‌పీ పవర్, 19.1 ఎన్ఎమ్ పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ బైక్ కేటీఎమ్ ఆర్‌సీ 200, సుజుకీ గిక్సర్ ఎస్ఎఫ్ 250, రాబోయే హోండా సీబీఆర్300ఆర్ మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.



## భవిష్యత్తులో మరింత బలమైన వృద్ధికి సిద్ధం

**గ్రామీణ రికవరీ, అర్బన్ ప్రీమియమైజేషన్‌తో సరికొత్త జోష్!**

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్త బ్రాండ్ల నుంచి 16% ఆదాయం**

**ఏజీఎం ప్రసంగంలో ఇమామి వ్యవస్థాపకుడు ఎస్ గోయెంకా ధీమా**




ముంబై: భవిష్యత్తులో మరింత బలమైన వృద్ధిని నమోదు చేయడానికి సిద్ధంగా ఉన్నామని దేశీయ ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం 'ఇమామి' వ్యవస్థాపకుడు, నాన్--ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎస్ గోయెంకా ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ మార్కెట్లలో వినియోగం మళ్లీ ఊపందుకోవడంతో పాటు, పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన ఉత్పత్తులకు డిమాండ్ (ప్రీమియమైజేషన్) పెరుగుతుండటం కంపెనీకి కలిసివస్తుందన్నారు. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) వాటాదారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గ్రామీణ రికవరీతో అధిక లబ్ధి అనుకూలమైన వర్షపాతం, మెరుగైన వ్యవసాయ రాబడులు, పెరుగుతున్న కొనుగోలు శక్తి వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం మళ్లీ వేగం పుంజుకుంటోందని గోయెంకా పేర్కొన్నారు. "ఇమామి వ్యాపారంలో అత్యధిక భాగం గ్రామీణ భారతంతోనే ముడిపడి ఉంది. అక్కడ మా బ్రాండ్లకు దశాబ్దాల నమ్మకం ఉంది. జీఎస్టీ సవరణల వల్ల సంఘటిత రంగానికి చెందిన ఉత్పత్తులు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ రికవరీ ద్వారా అత్యధిక లబ్ధి పొందేందుకు ఇమామి వ్యూహాత్మకంగా సిద్ధంగా ఉందనే నమ్మకం ఉంది" అని వివరించారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో డిజిటల్ వినియోగం పెరగడం, ఆరోగ్యం--వెల్నెస్‌పై అవగాహన పెరగడం తమకు కొత్త అవకాశాలను సృష్టిస్తోందని వివరించారు. నాన్--సీజనల్ ఉత్పత్తులను బలోపేతం చేయడం, కొత్త తరం కన్స్యూమర్ ప్లాట్‌ఫారమ్‌లలోకి విస్తరించడం ద్వారా కంపెనీని మరింత బలోపేతం చేసినట్లు చెప్పారు.

**వ్యూహాత్మక పెట్టుబడుల భాగస్వామ్యం**

హెల్త్ అండ్ వెల్నెస్ సంస్థ 'యాక్సియమ్ ఆయుర్వేద'తో పాటు 'ఇంక్‌నట్ డిజిటల్'కు చెందిన డిజిటల్--ఫస్ట్ బ్రాండ్లు 'వేదిక్స్', 'స్కిన్‌క్రాఫ్ట్'లలో సాధించిన వాటాలు కంపెనీ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని గోయెంకా తెలిపారు. తమ వ్యూహాత్మక పెట్టుబడులు గత ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై26) కన్సాలిడేటెడ్ టర్నోవర్‌లో దాదాపు ఆరు శాతం వాటాను అందించాయని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై27)లో ఈ వాటా 16 శాతానికి, ఎఫ్‌వై30 నాటికి 25 శాతానికి (నాలుగో వంతు) చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ?చతులు ఉన్నప్పటికీ స్వదేశీ వినియోగం, మౌలిక సదుపాయాల కల్పన, విధానపరమైన స్థిరత్వంతో భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందన్నారు.

## రూ.2 లక్షల జీతం.. అయినా కష్టాలే!

సాధారణంగా నెలకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల జీతం అంటే చాలామందికి మంచి ఆదాయమే. ఇలాంటి జీతం వస్తే హాయిగా జీవించొచ్చని అనుకుంటారు. కానీ.. పెద్ద నగరాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని ఓ మహిళ చెబుతోంది. నెలకు రూ.1-2 లక్షలు సంపాదిస్తున్నా.. ఖర్చులు పోగా చేతిలో పెద్దగా డబ్బు మిగలడం లేదని పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఏమిటీ 'శాలరీ ట్రాప్'**

ఇన్‌స్టాగ్రామ్‌లో నిధి కుష్వాహ్ అనే మహిళ ఈ విషయంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టైర్-1 నగరాల్లో నెలకు రూ.1-2 లక్షలు సంపాదించే వాళ్లు కూడా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆమె చెప్పిన లాజిక్ కూడా చాలామందికి కనెక్ట్ అవుతోంది. ఈ జీతం తక్కువ ఆదాయంతో జీవించే స్థాయి నుంచి బయటపడటానికి సరిపోతుంది. కానీ.. ఖరీదైన జీవనశైలిని ఎలాంటి ఆలోచన లేకుండా కొనసాగించడానికి మాత్రం సరిపోదు. అంటే.. జీతం బాగానే ఉంటుంది, కానీ నెలాఖరుకు బ్యాంక్ బ్యాలెన్స్ చూస్తే మాత్రం నిరాశే మిగులుతుంది.

**పెద్ద నగరాల్లో ఖర్చులు**

ఇక్కడ ప్రధాన సమస్య జీవన వ్యయం. టైర్-1 నగరాల్లో ఇంటి అద్దె ఒక్కటే జీతంలో పెద్ద భాగాన్ని తీసుకుపోతుంది. దానికి తోడు కరెంట్, ఇంటి ఖర్చులు,



కారు లేదా బైక్ ఈఎంఐ, పెట్రోల్, పిల్లల స్కూల్ ఫీజులు, వైద్యం, బయట తినడం, షాపింగ్ ఇలా ఒక్కో ఖర్చు కలుస్తూ పోతుంది. ఉదాహరణకు నెలకు రూ.1.5 లక్షలు జీతం వస్తే.. అందులో రూ.30-40 వేలు ఇంటి అద్దెకే వెళ్లొచ్చు. పిల్లలున్న కుటుంబాల్లో స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు అదనంగా ఉంటాయి. కారు ఈఎంఐ లేదా హోమ్ లోన్ ఉంటే మరో పెద్ద మొత్తం అక్కడే పోతుంది. చివరికి పొదుపు చేయడానికి అనుకున్న డబ్బు చాలా తక్కువగా మిగలొచ్చు.

**జీతం పెరిగితే ఖర్చులు కూడా**

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లేషన్. జీతం పెరిగినప్పుడు మన అవసరాలు మాత్రమే కాదు.. మన కోరికలు కూడా పెరుగుతాయి.

మంచి జీతం రావడంతో ఖరీదైన ఇల్లు, కొత్త కారు, ఎక్కువ ట్రావెల్స్, రెస్టారెంట్లు, బ్రాండెడ్ వస్తువులు ఇలా ఖర్చులు పెరగొచ్చు. మొదట్లో ఇవన్నీ చిన్న ఖర్చుల్లానే అనిపిస్తాయి. కానీ నెలాఖరుకు చూస్తే మొత్తం పెద్దదైపోతుంది. అందుకే కొంతమందికి జీతం రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షలకు పెరిగినా.. పొదుపు మాత్రం పెద్దగా పెరగదు.

**ఇతరులతో పోల్చుకోవడం మరో సమస్య**

సోషల్ మీడియా వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మన చుట్టూ ఉన్నవాళ్లు కొత్త కారు కొంటున్నారు, విదేశాలకు వెళ్తున్నారు, ఖరీదైన రెస్టారెంట్లకు వెళ్తున్నారు అని చూసి మనం కూడా అదే స్థాయిలో జీవించాలనుకుంటాం. కానీ వాళ్ల ఆదాయం ఎంత?, వాళ్ల అప్పులు ఎంత?, వాళ్లు ఎంత పొదుపు చేస్తున్నారు?, అనేది మనకు తెలియదు. అయినా వాళ్ల జీవనశైలిని చూసి మన ఆర్థిక పరిస్థితికి సరిపోని ఖర్చులు చేస్తే సమస్యలు మొదలవుతాయి.

**నెటిజన్ల స్పందన**

నిధి కుష్వాహ్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వచ్చాయి. కొందరు ఆమె చెప్పింది నిజమేనని అన్నారు. తమ స్నేహితులు కూడా ఇలాంటి ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని కొందరు చెప్పారు. అయితే.. మరికొందరు మాత్రం సమస్య జీతంలో కంటే మన ఖర్చు చేసే విధానంలో ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## కార్పొరేట్ కొనుగోళ్లు రెట్టింపు

**2017 నుంచి 2026 వరకూ క్రిసిల్ నివేదిక**

ముంబై: ఇతర కంపెనీల కొనుగోళ్లలో దేశీ కార్పొరేట్ దిగ్గజాలు భారీ ఆసక్తి చూపుతున్నట్లు దేశీ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తాజా నివేదికలో పేర్కొంది. 2016--17 ఆర్థిక సంవత్సరం నుంచి చూస్తే కొనుగోళ్లు రెట్టింపైనట్లు వెల్లడించింది. అయితే వీటిలో మూడోవంతు అనుకున్న ఫలితాలు సాధించలేకపోయినట్లు తెలియజేసింది. విభిన్న కారణాలతో కంపెనీలు ఇతర సంస్థల కొనుగోళ్లను చేపడుతున్నట్లు క్రిసిల్ ఎండీ సుబోధ్ రాయ్ తెలియజేశారు. వృద్ధిని పెంచుకోవడంలో వేగం, మార్కెట్లలో మరింత విస్తరించడం, కొనుగోళ్ల సామర్థ్యాలకు పదును పెట్టుకోవడం తదితరాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. నివేదిక విశ్లేషణ ప్రకారం 2017 నుంచి డీల్స్ సంఖ్య రెట్టింపైంది. 20 రంగాల నుంచి విడిగా రూ. 500 కోట్లకుపైగా విలువైన 600 డీల్స్‌ను నివేదిక విశ్లేషించింది. అయితే విశ్లేషణలో ఫైనాన్షియల్ సర?వసులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలలోని లావాదేవీలను మినహాయించింది. ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) దిగ్గజాలు దేశీయంగా చేపట్టే డీల్స్‌కు సైతం చోటివ్వలేదు.

**కారణాలు వేరువేరు..**

క్రిసిల్ నివేదిక ప్రకారం ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కన్స్యూమర్ బిజినెస్‌లు టెక్నాలజీల అనుసంధానం, నైపుణ్యాలు, మేథోసంపత్తిని సమకూర్చుకోవడం తదితరాల కోసం కొనుగోళ్లను చేపడుతున్నాయి. సిమెంట్, మెటల్స్ రంగాలలోని పరిశ్రమలు.. కన్సాలిడేషన్, ప్లాంట్ల నిర్మాణ సమయాన్ని తగ్గించుకోవడం తదితరాలపై దృష్టితో కొనుగోళ్లకు తెరతీస్తున్నాయి. తద్వారా 4--6 ఏళ్ల కాలాన్ని ఏడాది నుంచి మూడేళ్లకు తగ్గించుకుంటున్నాయి. రుణ సమీకరణతో చేపట్టిన 100కుపైగా భారీ డీల్స్ మూడింటిలో రెండు అంచనాలను అందుకున్నట్లు రాయ్ పేర్కొన్నారు. కొన్ని డీల్స్ ఏకీకృతంకావడంలో విఫలంకాగా.. నియంత్రణ సంస్థల ఆలస్యాలు, దేశ సరిహద్దులనుదాటి(క్రాస్‌బోర్డర్) చేపట్టే కొనుగోళ్లు కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నట్లు వివరించారు. కొనుగోళ్లు, విలీనాలనేవి వ్యూహాత్మక నిర్ణయాలతోనే విజయవంతంకాబోవని, క్రమశిక్షణాయుత ఏకీకృత చర్యలు, సమయానుగుణంగా సొంతం చేసుకోవడం, వనరుల సమర్థవంత వినియోగం తదితరాలు ఇందుకు సహకరించనున్నట్లు అభిప్రాయపడ్డారు.



# 'తెల్లకాగితం' విడుదల అప్పుడే

'కోర్ట్'ఫేం హర్ష్ రోషన్ హీరోగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'తెల్ల కాగితం'. నక్షత్ర కథానాయిక. రమేశ్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు హర్ష్‌రోషన్, నక్షత్ర ఎంతో క్యూట్‌గా కనిపిస్తున్నారు.కొత్త సినిమాలు చూడటం కురుస్తున్న వర్షపు చినుకులు, గొడుగులా అడ్డు పెట్టుకున్న అరిటాకు, నాయకానాయికల రొమాంటిక్ లుక్స్.. ఇవన్నీ ఎంతో సహజంగా.. సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచిందని, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: నందు సవిరిగాన, కెమెరా: కేవీ గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: అరుణాచల క్రియేషన్స్.



# మనసును తాకే 'కాగితం పడవలు'

వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ 'కాగితం పడవలు'. ఎంజీఆర్ తుకారం దర్శకుడు. కీర్తన నరేశ్, టీఆర్ ప్రసాద్‌రెడ్డి వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మాతలు. సెప్టెంబర్ 18న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. 'ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రేమకథ ఉంటుంది. ఈ సినిమా చూస్తే వారివారి ప్రేమకథలు గుర్తొస్తాయి' అని దర్శకుడు తుకారాం తెలిపారు. సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు వర్ధన్, కృష్ణప్రియ ఆనందం వెలిబుచ్చారు. సెప్టెంబర్ 18న సినిమాను విడుదల చేస్తున్నామని, తప్పకుండా అందరూ మెచ్చే సినిమా అవుతుందని నిర్మాత అంజనప్ప నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా డీవోపీ రుద్రసాయి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: సాయి నౌఫల్ రాజా.



# 'ఆదర్శకుటుంబం' కోసం క్లాసిక్ సాంగ్ రీమేక్?

తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47' సినిమా ముందు వరుసలో ఉంటుంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. ఆ సినిమాల విజయాల్లో వెంకటేశ్ నటన, త్రివిక్రమ్ రచన ప్రధాన పాత్రలు పోషించాయనడం అతిశయోక్తి కాదు. అప్పుడు వెంకటేశ్ సినిమాకి రచయితగా పనిచేసిన త్రివిక్రమ్.. ఇప్పుడు అదే వెంకటేశ్‌ని డైరెక్ట్ చేస్తున్నారు. దాంతో 'ఆదర్శకుటుంబం' సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు ఆకాశమంత ఏర్పడ్డాయి. అక్టోబర్ 2న గాంధీజయంతి కానుకగా సినిమా విడుదల కానున్నది.కొత్త సినిమాలను ఆన్‌లైన్‌లో స్ట్రీమ్ చేయడం ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నది. ఆ వివరాల్లోకెళ్తే.. వెంకటేశ్ చిత్ర విజయాల్లో 'కూలీ నెం 1' సినిమా ఒకటి. ఆ సినిమాలోని 'దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా.. దయుంచయ్యా దేవా..' సాంగ్ ఎంత హిట్టో అందరికీ తెలిసిందే. వినాయకచవితి పందిళ్లలో నేటికీ ఈ పాట మారుమోగుతూనే ఉంది. ఆ పాటను ఈ సినిమా కోసం రీమేక్ చేస్తున్నట్టు తెలిసింది. ఇదే నిజమైతే.. సినిమాకు ఈ పాట ప్రత్యేక ఆకర్షణ కాకమానదు.క్లైమాక్స్, ఓ పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని టాక్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో శ్రీనిధిశెట్టి కథానాయిక. నివేదా పేతురాజ్, యువిన, రాజ్ ప్రజ్వల్, రావురమేశ్, సత్య, బ్రహ్మాజీ ఇతర పాత్రధారులు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈచిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే.



# ఆమె వల్లే పేరు మార్చుకున్నా..

వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిపరమైన బాధ్యతలనూ రెండిటినీ సమానంగా ఎంజాయ్ చేస్తుంటారు నటి కియారా అద్వానీ. పెళ్లి, ప్రెగ్నెన్సీ, పేరెంట్‌హుడ్.. ఇలా జీవితంలో ఎన్ని కొత్త దశలు వచ్చినా ఆమె కెమెరాకు బ్రేక్ ఇవ్వకపోవడానికి కారణం అదే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలోని ఆసక్తికరమైన అంశాలను కియారా వెల్లడించారు. 'మా అమ్మ టీచర్. నేనూ అమ్మలా టీచర్ కావాలనుకున్నా. కానీ నటిని అయ్యాను. డెస్టినీ అంటే అదే. నా అసలు పేరు ఆలియా. నేను ఇండస్ట్రీకి వచ్చేనాటికే అలియాభట్ పాపులర్. అందుకే పేరు మార్చుకోవాల్సి వచ్చింది. 'అంజానా అంజానీ' సినిమాలో ప్రియాంక చోప్రా పోషించిన 'కియారా' పాత్రంటే నాకెంతో ఇష్టం. అందుకే ఆ పాత్ర పేరునే నా పేరుగా మార్చుకున్నా. 'ఫగ్లీ'తో నా కెరీర్ మొదలైనా, 'ఎంఎస్ ధోని: ది అన్ టోల్డ్ స్టోరీ' చిత్రం నా కెరీర్‌ని మలుపు తిప్పింది. అందులో నేను పోషించిన 'సాక్షి' పాత్ర నన్ను స్టార్‌ని చేసింది. కెరీర్ అనేది కొన్నాళ్లు కొనసాగాలంటే ఫిట్‌గా ఉండాలి. అందుకే వర్కవుట్లు బోరింగ్ అయినా తప్పడం లేదు. ఫిట్‌నెస్ కోసం కిక్ బాక్సింగ్ లాంటివి కూడా చేస్తాను. యాక్షన్ సినిమాలు చేసేటప్పుడు ఆ ట్రైనింగ్ ఉపయోగపడుతుంది. ఖాళీ సమయాల్లో ఇంట్లో కూర్చొని బొమ్మలు గీస్తుంటా. నా బ్యాగ్‌లో ఎప్పుడూ ఓ బుక్, స్కెచ్ పెన్స్, పెన్సిల్స్ ఉంటాయి. అలాగే అమెరికన్ సిరీస్, సైకలాజికల్ థ్రిల్లర్స్ చూస్తూ ఎంజాయ్ చేస్తా' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు కియారా అద్వానీ.

# నటనకు అవకాశం ఉన్నపాత్ర చేశాను



సుమన్, సాయికుమార్, వరుణ్ సందేశ్, వితికా షేరు, నటరాజ్, రాయంచ కొక్కుర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞానప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మించారు. ఈ మూవీ పీవీఆర్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా సెప్టెంబరు 4న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో జై జ్ఞానప్రభ మాట్లాడుతూ-- "పొలిటికల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. మహావీర్ మ్యూజిక్, చంద్రబోస్‌గారి సాహిత్యం మా సినిమాకు ఆకర్షణగా నిలుస్తాయి. మా సినిమా ప్రేక్షకుల్ని ఏమాత్రం నిరాశపరచదు" అని చెప్పారు. "మా మూవీ ఔట్‌పుట్ అందరికీ నచ్చేలా వచ్చింది... ప్రేక్షకాదరణ దక్కుతుందని ఆశిస్తున్నాం" అని మేరుం భాస్కర్ తెలిపారు. "ఇటీవల నటనకు విరామం ఇచ్చాను. అయితే 'ధర్మస్థల నియోజకవర్గం'లో డిఫరెంట్ క్యారెక్టర్ రావడంతో ఒప్పుకున్నాను. నటనకు మంచి స్కోప్ దక్కింది" అని వితికా షేరు పేర్కొన్నారు.




# ఆనందాన్ని పంచిన చిరంజీవి

కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటించిన సర్వైవల్ థ్రిల్లర్ 'చిరంజీవి'. శుభసాయివెంకట్ దర్శకత్వంలో దీప్తి నడిమింటి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. 'ఈ సినిమా నిర్మాణంలో ఉన్నప్పుడు ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. వాటన్నింటినీ అధిగమించి సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేసినప్పుడే మేం తొలి విజయాన్ని సాధించాం. ఫస్ట్ కాపీ చూశాక ఈ సినిమా హిట్ అని ఫిక్సయ్యాం. ఈ విధంగా ఈ సినిమా విషయంలో అనేక దశల్లో మేం సక్సెస్ అవుతూ వచ్చాం. ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద కూడా విజయాన్ని అందుకున్నాం. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది' అంటూ దర్శకుడు శుభసాయివెంకట్ సంతోషం వెలిబుచ్చారు. కంటెంట్ బావుంటే చిన్న సినిమా అయినా ప్రేక్షకులు ఆదరిస్తారని ఈ సినిమాతో రుజువైందని, ఈ సినిమా తమకు ఎన్నో అనుభవాలను ఇచ్చిందని నిర్మాత దీప్తి నడిమింటి చెప్పారు. మూవీలోని ఎమోషన్‌కు ఆడియన్స్ బాగా కనెక్టయ్యారని, ఈ సినిమాకోసం మేం పడిన కష్టాన్ని ప్రేక్షకుల స్పందన మరిపించిదని హీరో కికు యనమల అన్నారు. ఇంకా ఎడిటర్ చోటా కె ప్రసాద్ కూడా మాట్లాడారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/